సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 24 । మే । 2023



బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: బద్దిపోచమ్మకు మంగళవారం భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. డప్పుల చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరి బోనం సమర్పించారు.



జేపీఎస్‌ల కృతజ్ఞతలు

సిరిసిల్ల: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్యాంపు ఆఫీస్‌లో కలిశారు. తమను క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

గరిష్టం/కనిష్టం
40.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలి



మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ముస్తాబాద్/తంగళ్లపల్లి: జిల్లాలో ధాన్యం సేకరణను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో రైస్‌మిల్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. మిల్లు వద్ద ధాన్యంతో నిలిచిఉన్న లారీలను చూసి అధికారులను ప్రశ్నించారు. రోజుల తరబడి ధాన్యంతో వేచిఉండకుండా మిల్లులకు చేరిన ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని సూచించారు. అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేపట్టాలన్నారు. ఆయన వెంట డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ మునీందర్, ఆర్‌ఐ శ్యాం, తదితరులు ఉన్నారు. అదే విధంగా తంగళ్లపల్లిలోని పలు రైస్ మిల్లులను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించి, వేతనాలు అందించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కోనరావుపేటలో వీవోఏలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. వారికి మద్దతు ప్రకటించిన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వీవోలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బతుకమ్మ చీరలపంపిణీ, కంటి వెలుగుతో పాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరే కీలకం అన్నారు. వీవోఏలకు కనీసం రూ.26వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. బీమా తదితర సౌకర్యాలు అందించి కోరారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు షేక్ పిరోజ్‌పాషా, చేపూరి గంగాధర్, తాళ్లపెల్లి ప్రభాకర్, గొట్టె రుక్మిణి, ప్రదీప్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇంటర్ తొలి సంవత్సరానికి గిరిజన విద్యార్థుల నుంచి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డీఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. దుమాలలో ఎంపీసీ 7, బీపీసీ 1, సీఈసీ 17 సీట్లు, మర్రిమడ్లలో ఎంపీసీ 15, బీపీసీ 25, సీఈసీ గ్రూప్‌లో 30 సీట్లు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు ఈ నెల 29న దుమాలలోని రెసిడెన్షియల్ పాఠశాల ఉదయం 9 గంటలకు నేరుగా సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

నెరవేరిన ప్ర'జల'కల

- మల్కపేటకు చేరిన గోదావరి
- ఎత్తిపోసిన మొదటి పంపు.. పక్షంరోజుల్లో రెండోపంపు సిద్ధం
- మల్కపేట వద్ద పంపింగ్ ట్రయల్ రన్ సక్సెస్

సిరిసిల్ల: జిల్లాలోని కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు జలాశయం నుంచి గోదావరి జలాలు మంగళవారం ఎగిసిపడ్డాయి. 30హెచ్‌పీల మోటార్ ట్రయల్ రన్ సక్సెస్ అయింది. సిరిసిల్ల మధ్యమానేరు నీరు సొరంగం దాటి పంపింగ్ ద్వారా రిజర్వాయర్‌లోకి దూకాయి. జిల్లాలోని 96,150 ఎకరాలకు శాశ్వతంగా సాగునీరు అందించే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం- 9 ప్యాకేజీ పనుల్లో తొలి అడుగు పడింది. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది.

గో'దారి' దొరికింది

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సిరిసిల్ల మధ్యమానేరు జలాశయానికి మూడేళ్ల కిందటే చేరాయి. మధ్యమానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండలం మల్కపేట వద్ద మూడు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్‌లోకి మళ్లించారు. మలక్పేట, నిజామాబాద్, కోనరావుపేట శివారుల్లో మూడు గుట్టల మధ్య, ఆరు కట్టల రిజర్వాయర్‌ను కట్టారు. మధ్యమానేరు నీరు మల్కపేటకు ఇప్పుడు చేరింది. అక్కడి నుంచి ఎత్తిపోతలు, గ్రావిటీ ద్వారా సింగసముద్రం, ఎగువ మానేరు నింపుతారు. నిమ్మపల్లి మూలవాగు, రంగంపేట, మరిమడ్ల, గర్జనపల్లి చెరువుల్లోకి గోదావరి జలాలు చేరనున్నాయి.

ఎన్నో అవాంతరాల మధ్య

సిరిసిల్ల నుంచి మల్కపేట వరకు 12 కిలోమీటర్లు ఉంటుంది. సొరంగం ద్వారానే మధ్యమానేరు బ్యాక్‌వాటర్ మల్కపేట రిజర్వాయర్‌కు చేరింది. సొరంగం పనులు అనేక అవాంతరాల మధ్య పూర్తి అయ్యాయి. సొరంగంలో నిండా నీరు ఉండడంతో ఆ నీటిని ఎత్తిపోస్తూ.. పనులు చేశారు. మల్కపేట వద్ద నిర్మించిన సర్జిపూల్‌లోనూ నిండా నీరు చేరింది. వాటిని ఎత్తిపోసి పనులు చేశారు. సొరంగంలో పైకప్పు కూలడం వంటి ప్రమాదాలు జరిగాయి. మరో వైపు మల్కపేట నుంచి నిమ్మపల్లి మూలవాగు, కోనరావుపేటకు, అల్మాస్‌పూర్, వీర్నపల్లి నాలుగు చిన్న లిఫ్టులను మరో రూ.137 కోట్లతో చేపట్టారు. ఇవి పూర్తి అయితే..జిల్లాలో సాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది.




మల్కపేట పంపింగ్ వద్ద ఇరిగేషన్ అధికారులతో ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

రాత్రంతా ఇంజినీర్లు అక్కడే

సోమవారం రాత్రి మల్కపేట పంప్‌హౌజ్‌కు చేరుకున్న ఇరిగేషన్‌శాఖ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారులు పెంటారెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలు సత్యనారాయణ, వినోద్‌కుమార్, అధికారులు రాత్రంతా అక్కడే ఉండి పర్యవేక్షించారు. సర్జిపూల్ నుంచి మోటార్‌తో ట్రయల్ రన్‌ను మంగళవారం ఉదయం 7.30గంటలకు ప్రారంభించడంతో 10 నిమిషాల్లో చెరువులోకి అంద్రుమట్టితో కూడిన నల్లనీరు ఎగిసిపడింది. నీరు చెరువులోకి చేరడంతో అధికారుల్లో ఆనందం కనిపించింది. ఎగిసిపడుతున్న గోదావరి జలాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ.. ఆనందాన్ని పంచుకున్నారు. ట్రయల్ రన్ సక్సెస్ అయినట్లు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు ప్రకటించారు. గంటసేపు నీటిని పంపింగ్ చేసి మోటారును నిలిపివేశారు.

9వ ప్యాకేజీ.. ప్రయోజనాలు

మల్కపేట రిజర్వాయర్‌ను రూ.504 కోట్లతో చేపట్టారు. ఎగువ మానేరు వరకు గోదావరి జలాలు చేరితే కొత్తగా 70వేల ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. మరో 26,150 ఎకరాలు స్థిరీకరించబడుతాయి. మొత్తంగా జిల్లాలోని కోనరావుపేట, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్ మండలాల్లోని 96,150 ఎకరాలకు శాశ్వతంగా సాగు నీరు లభిస్తుంది. ఇటు సిరిసిల్ల మానేరువాగు, అటు వేములవాడ మూలవాగులు జీవనదులుగా మారి సాగునీటి ఎద్దడిని తొలగిస్తుంది.



మూడు టీఎంసీల మల్కపేట రిజర్వాయర్



సిరిసిల్ల- మల్కపేట సొరంగం

మంత్రి కేటీఆర్ చొరవతో

నర్మాల ఎగువ మానేరుకు సిరిసిల్ల మధ్యమానేరు నీటిని చేర్చేందుకు మంత్రి కేటీఆర్ చొరవ చూపారు. సమయం దొరికినప్పుడల్లా.. ఉన్నత స్థాయిలో సమీక్ష నిర్వహించారు. పలుమార్లు సొరంగంలోకి వెళ్లి పనులు సందర్శించారు. మంత్రి కేటీఆర్ చొరవతో మధ్యమానేరు నీరు మలక్పేటకు చేరింది. 30 హెచ్‌పీ మోటారుతో పంపింగ్‌కు శ్రీకారం చుట్టగా మరో మోటారును మరో పక్షంరోజుల్లో ప్రారంభించనున్నారు.

జూన్‌లోగా మెడికల్ కాలేజీ భవనం



సిరిసిల్ల: సిరిసిల్ల మెడికల్ కాలేజీ పనులు వేగంగా పూర్తి చేయాలని, జూన్‌లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. సిరిసిల్ల శివారులోని పెద్దూరు బైపాస్ రోడ్డు వెంట రూ.39 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. అదనపు లిఫ్టును కూడా మెడికల్ కాలేజీ భవనంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు, తదితరులు ఉన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. పట్టణంలోని తారక రామానగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలోని సుందరయ్యనగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి ఆరోగ్య మహిళా శిబిరాన్ని పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, ఉప వైద్యాధికారులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, స్థానిక డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట, రాగట్లపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీలు చేశారు.ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు పెంచాలని అన్నారు. ఆరోగ్యకేంద్రంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. ప్రసవాల సంఖ్య గణనీయంగా పెంచాలని సూచించారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం వేములవాడ, సిరిసిల్లలోని సుందరయ్యనగర్, తంగళ్లపల్లి, నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 407మందికి పరీక్షలు చేశారు. ఇందులో థైరాయిడ్ 72, సీబీపీ పరీక్షలు 77మందికి నిర్వహించారు. విటమిన్‌డీ లోపం 35మంది, 54మందిలో సూక్ష్మపోషకాల లోపం ఉన్నట్లు గుర్తించారు. 107మందికి రక్త,మూత్ర పరీక్షలు చేశారు. పలు ఆరోగ్య సమస్యలు ఉన్న 14మందిని జిల్లా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు.

25న జాబ్ మేళా

సిరిసిల్లకల్చరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీ టీసీఎస్‌లో బీపీవో ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలో డిగ్రీ ఉత్తీర్ణత గలవారు హాజరుకావచ్చు అని తెలిపారు. అర్హత, ఆసక్తి గల యువత కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగే జాబ్ మేళాలో విద్యార్హత ధ్రువీకరణపత్రాలతో నేరుగా హాజరుకావాలన్నారు.

మెరిసిన ఆణిముత్యాలు

- సివిల్స్‌లో ఉమ్మడి జిల్లావాసుల ప్రతిభ
- ఆవుల సాయికృష్ణకు 94వ ర్యాంకు
- 132వ ర్యాంకు సాధించిన శివమారుతిరెడ్డి

కరీంనగర్/కోరుట్ల: వాళ్లు లక్ష్య సాధనపైనే దృష్టి సారించారు.. కృషి, పట్టుదలతో చదివారు.. ఒకసారి తప్పినా మరోసారి మరింత కసి పెంచుకున్నారు.. తల్లిదండ్రులు, పెద్దల ప్రోత్సాహంతో ముందుకు కదిలారు.. అకుంఠిత దీక్షతో చదివారు.. సివిల్స్‌లో ర్యాంకులు సాధించారు.. విజయానికి పేదరికం, ఆర్థిక పరిస్థితులు అడ్డుకాదని నిరూపించారు.

సుమితా డావ్రా స్ఫూర్తి



ఆవుల సాయికృష్ణ

'సివిల్స్ అనేది ఓ తపస్సు లాంటిది.. ఎన్ని గంటలు, ఎంతసేపు చదివామన్నది కాదు.. ఎంత విషయ పరిజ్ఞానం పెంపొందించుకున్నామనేదే ముఖ్యం' అని సివిల్స్-2022 ఫలితాల్లో ఆల్ ఇండియాలో 94వ ర్యాంకు సాధించిన ఆవుల సాయికృష్ణ అన్నారు. ఉన్నత చదువులకు పేదరికం, ఆర్థిక పరిస్థితులు కారణాలు కావని పేర్కొన్నారు. కంటెంట్ కాదు.. క్వాలిటీ ముఖ్యమని... చదువుకుంటున్న రోజుల్లో కరీంనగర్ కలెక్టర్‌గా పనిచేసిన సుమితా డావ్రా నాకు స్ఫూర్తన్నారు.

కరీంనగర్, హైదరాబాద్‌లో చదువు..

కరీంనగర్ పారమిత పాఠశాల, ఇంటర్మీడియట్ హైదరాబాద్ నారాయణ కళాశాల, ఇంజినీరింగ్ వరంగల్ నీట్‌లో సాగింది. మాది మధ్య తరగతి కుటుంబం. నాన్న ఆవుల లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అమ్మ సునీత గృహిణి. సోదరుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం. రెండో ప్రయత్నంలోనే 2017 బ్యాచ్‌లో 728వ ర్యాంక్ సాధించిన. మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ రీజినల్ డైరెక్టర్ (ఎస్‌ఈఆర్), హైదరాబాద్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా. ఎలాగైనా ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ఆరోసారి పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించా.



సాయికృష్ణ తల్లిదండ్రులు లక్ష్మయ్య- సునీత

రెండో ప్రయత్నంలో...



మిఠాయిలు పంపిణీ చేస్తున్న కుటుంబసభ్యులు

సివిల్స్‌లో పల్లె ఆణిముత్యం మెరిసింది. చిన్ననాట తండ్రి మార్గనిర్దేశనంలో ఇచ్చిన లక్ష్యం చేరుకోవడంలో ఆ యువకుడు విజయం సాధించారు. ఆయనే ఏనుగు శివమారుతిరెడ్డి. మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో 132 ర్యాంకు సాధించి సత్తా చాటారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు అంజిరెడ్డి-పుష్పలత దంపతుల కుమారుడు శివమారుతిరెడ్డి. అంజిరెడ్డి మల్లాపూర్ మండలం గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. పుష్పలత వ్యవసాయ పనులు పర్యవేక్షిస్తారు. ప్రాథమిక విద్యాభ్యాసం కోరుట్ల మండలం అయిలాపూర్ విశ్వశాంతి పాఠశాల జరిగింది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ హైదరాబాద్ శ్రీచైతన్య కళాశాలలో సాగింది. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ యూనివర్సిటీ బీఏ(ఎకనామిక్స్)లో చేరారు.

రెండో ప్రయత్నంలో..

మూడేళ్లక్రితం డిగ్రీ పూర్తిచేసి 2021లో తొలిసారి సివిల్స్ రాశారు. ఆ సమయంలో కోవిడ్ బారినపడి ప్రిలిమినరీలో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తండ్రి అంజిరెడ్డి ప్రోత్సాహంతో మళ్లీ సన్నద్ధమయ్యా రు. రెండోసారి విజయం సొంతం చేసుకున్నారు.

నాన్నపై ప్రేమతో.. : శివమారుతిరెడ్డి



అమ్మ పుష్పలత, నాన్న ఆశయాలు సాధించడానికి కష్టపడి చదివా. ప్రతీరోజు 8 గంటలు చదివేవాడిని. సిలబస్‌ను చిన్నచిన్న విభాగాలుగా మార్చుకుని వారానికి ఓ విభాగం లెక్కన ఒకదాని తర్వాత ఒకటి పూర్తిగా చదివి అవగాహన పెంచుకున్నా. సివిల్స్ సాధనలో నాకు ఎన్‌సీఈఆర్‌టీ బేసిక్ నుంచి ఉన్నతస్థాయి వరకు ఉన్న పుస్తకాలు ఉపయోగపడ్డాయి. ప్రస్తుత ర్యాంకు ప్రకారం ఐఏఎస్ క్యాడర్ వస్తుందని ఆశిస్తున్నా. అందులో చేరాక మళ్లీ సివిల్స్ రాస్తా. ఫారిన్ సర్వీసెస్ సాధించాలన్నది నా లక్ష్యం.

సార్.. లెటర్ ప్లీజ్

- డీఎస్పీ నుంచి ఎస్సైల వరకు సిఫారసుల కోసం పరుగులు
- పోస్టింగులు ఇప్పించాలని ఎమ్మెల్యేలకు వినతులు
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాల తరువాత బదిలీల ముహూర్తం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సివిల్ సర్వెంట్ల బదిలీలు
- త్వరలో మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు?



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఎప్పుడు ఎన్నికల షెడ్యూలు వచ్చినా.. విధుల నిర్వహణకు రెడీగా ఉండేలా పోలీసు కమిషనర్లు, ఎస్పీలు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పోస్టింగుల కోసం పోలీసు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మూడేళ్లు గడువు తీరిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ పోస్టు కోసం ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌డివిజన్ కోసం డీఎస్పీ, ఏసీపీ ర్యాంకు అధికారుల మధ్య పోటీ నెలకొంది. చాలాకాలంగా లూప్‌లైన్‌లో ఉన్న వారు, పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న వారంతా అధికార పార్టీ ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు లేఖల కోసం యత్నిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ ర్యాంకు అధికారులు ఇటీవల అడపాదడపా బదిలీకాగా.. ఎస్సై ర్యాంకు అధికారులు మార్చిలోనే బదిలీ అయ్యారు.

వెంటాడుతున్న నిబంధనలు..

కరీంనగర్ జిల్లా ముందునుంచి రాజకీయంగా ప్రత్యేకతను కలిగిఉంది. సంచలనాలు, ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరున్న జిల్లాలో పోలీసులు, రెవెన్యూ అధికారులకు పోస్టింగులు దక్కడం ఆషామాషీ కాదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పు నిప్పు అన్న పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా విశ్వసనీయతను పక్కన బెట్టి ప్రతిభావంతులు, సమర్థులైన అధికారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వెంట్ల నుంచి ఆర్డీవోలు, డీఎస్పీ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, ఎస్సైల వరకు అందరికీ ఇదే సూత్రం పాటించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడ చిన్న లోపం దొరికినా.. ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పకడ్బందీగా పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న అధికారులంతా ఆ నియోజకవర్గంలో పనిచేయకూడదు. అదే సమయంలో గతంలో అదే నియోజకవర్గంలో ఉప ఎన్నిక లేదా జనరల్ ఎన్నికలు నిర్వహించి ఉండకూడదు.

దశాబ్ది ఉత్సవాల తరువాత బదిలీలు..

విశ్వసనీయ సమాచారం ప్రకారం...ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇన్‌స్పెక్టర్ల వంటి పోస్టింగులు చాలావరకు మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఐఏఎస్, ఐపీఎస్ బదిలీల వ్యవహారం రాజధానిలో నిర్ణయిస్తారు. కానీ... ఆర్డీవో, డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై ర్యాంకు అధికారుల్లో చాలామంది తదుపరి పోస్టింగ్ ఎక్కడన్నది ఇప్పటికే దాదాపు అవగాహన ఉంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణాలతో బదిలీలు ఆలస్యమవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు అంటే జూన్ 2 తర్వాత కొలిక్కి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

జగిత్యాల

కలెక్టర్: యాస్మిన్‌బాషా: ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): మందా మకరంద్, ఏడాదిగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): లత, రెండేళ్లుగా కొనసాగుతున్నారు.
ఎస్పీ: భాస్కర్, ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
ఆర్డీవోలు: మెట్‌పల్లి-కోరుట్ల ఆర్డీవోగా ఉన్న వినోద్, జగిత్యాల ఆర్డీవోగా ఉన్న మాధురి మూడేళ్లుగా పనిచేస్తున్నారు.
డీఎస్పీలు: ప్రకాశ్, రవీందర్‌రెడ్డి కాస్త అటూ ఇటూగా రెండేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు.

కరీంనగర్

కలెక్టర్: ఆర్వీ కర్ణన్ దాదాపు రెండేళ్లుగా పనిచేస్తున్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ జనరల్ ఎన్నిక నిర్వహించారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): శ్యామ్ ప్రసాద్‌లాల్ ఐదేళ్లుగా పనిచేస్తున్నారు.
అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్): గరిమాఅగర్వాల్ ఏడాదిన్నర కింద చేరారు.
సీపీ కరీంనగర్: ఎల్. సుబ్బారాయుడు, ఇటీవలే విధుల్లో చేరారు.
అడిషనల్ డీసీపీ (ఎల్అండ్‌వో): శ్రీనివాస్, మూడేళ్లుగా కొనసాగుతున్నారు.
అడిషనల్ డీసీపీ (అడ్మిన్): చంద్రమోహన్, నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు.
ఏసీపీలు: అర్బన్ ఏసీపీ తుల శ్రీనివాస్, రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు రెండేళ్లలోపే.. హుజూరాబాద్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉపఎన్నిక ముందు వచ్చారు.
ఆర్డీవోలు: కరీంనగర్ ఆనంద్ కుమార్ ఐదేళ్లవుతోంది.. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్ ఇటీవలే బాధ్యతలు తీసుకున్నారు.

పెద్దపల్లి

కలెక్టర్: సంగీత సత్యానారాయణ రెండేళ్లు అవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): లక్ష్మీ నారాయణ, మూడున్నరేళ్లవుతోంది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): దీపక్‌కుమార్, రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నారు.
సీపీ రామగుండం: రెమా రాజేశ్వరి, ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.
ఆర్డీవోలు: పెద్దపల్లి-వెంకట మాధవరావు, మంథని- వీరబ్రహ్మాచారి ఇద్దరూ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
డీఎస్పీలు: ఎడ్ల మహేశ్ ఇటీవలే వచ్చారు. గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ రెండేళ్లు దాటింది.

సిరిసిల్ల

కలెక్టర్: అనురాగ్ జయంతి.. ఏడాదిన్నర పూర్తి చేసుకున్నారు.
ఎస్పీ: అఖిల్‌మహాజన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు.
అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ): ఖీమ్యా నాయక్, ఏడాది గడిచింది.
అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్): సత్యప్రసాద్, రెండేళ్లు గడిచాయి.
ఆర్డీవోలు: సిరిసిల్ల-టీ.శ్రీనివాసరావు నాలుగేళ్లు.. వేములవాడ- పవన్‌కుమార్ ఏడాది దాటింది.
డీఎస్పీలు: సిరిసిల్ల- విశ్వప్రసాద్ ఏడాది దాటింది. వేములవాడ- నాగేంద్రాచారి ఏడాదిన్నర అయింది.

లారీల కొరత.. రైతుల పడిగాపులు

- ధాన్యం తరలించడం లేదని వేములవాడ- కోరుట్ల రోడ్డుపై ధర్నా
- సీఐ, తహసీల్దార్ జోక్యంతో శాంతించిన రైతులు

చందుర్తి/బోయినపల్లి:'లారీలు రావడం లేదు.. నెల రోజులుగా ధాన్యం తరలడం లేదు. మబ్బును చూస్తే భయమేస్తోంది. అధికారులు పట్టించుకోవడం లేదు' అంటూ చందుర్తి మండలం మూడపల్లి, నర్సింగపూర్, ఆశిరెడ్డిపల్లె గ్రామాల రైతులు మంగళవారం వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిపై మూడపల్లి బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు. సుమారు అరగంటకుపైగా రైతులు ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీల కొరత లేకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేయించి ధాన్యాన్ని తరలించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చినప్పటికీ, కలెక్టర్ రావాలంటూ రైతులు పట్టుబట్టారు. తహసీల్దార్ ఎండీ.మజీద్ అక్కడికి చేరుకుని లారీల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చినా వినలేదు. సీఐ కిరణ్‌కుమార్ లారీలను గ్రామాలకు పంపించే బాధ్యత తనదేనని మూడపల్లి సర్పంచ్ చిలుక అంజిబాబుకు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి, తదితరులున్నారు.



చందుర్తి: రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఐదు కిలోలు కటింగ్ చేస్తున్నారు..

మండలంలోని బూర్గుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తప్ప, తాలు, తేమ పేరుతో కొర్రీలు పెడుతూ క్వింటాల్‌కు ఐదు కేజీలు కట్ చేస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం బోయినపల్లిలో ఆందోళనకు దిగా రు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి రైసుమిల్లర్లు ధాన్యాన్ని తరుగు, తదితర కారణాలతో కటింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ఆందోళనకు సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ మద్దతు తెలిపారు. అధి కారుల అలసత్వంతోనే క్వింటాల్‌కు 5 నుంచి 6కిలోలు కట్ చేస్తున్నారని ఆరోపించారు.

లారీల కోసం రంగంలోకి..



రగుడు సర్కిల్ వద్ద ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల: రోడ్డుపై ఎర్రటి ఎండలో నిరీక్షిస్తున్న వారంతా ప్రజాప్రతినిధులు. ఒక్కరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయితే.. మరొకరు సింగిల్ విండో చైర్మన్, ఇంకొరు గ్రామ సర్పంచ్.. వీరంతా మంగళవారం మధ్యాహ్నం సిరిసిల్ల కలెక్టరేట్ సమీపంలోని రగుడు సర్కిల్ వద్ద నిరీక్షించారు. ఎవరి కోసమో తెలుసా.. లారీల కోసం. కోనరావుపేట మండలంలో ధాన్యం తూకం పూర్తి అయింది.. లారీలు లేక వడ్ల తరలింపు పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతలకు సమాధానం చెప్పలేక.. అధికారులకు చెప్పినా.. లారీలు రాక..వారే రంగంలోకి దిగారు. రెండు గంటల పాటు రహదారిపై కాపలా కాసినా.. ఒక్క లారీ రాకపోవడంతో నిరాశతో వెళ్లారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సాయి

ముస్తాబాద్(సిరిసిల్ల): సీఎం కప్ జిల్లాస్థాయి పోటీల్లో ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయ విద్యార్థులు సత్తాచాటారు. సిరిసిల్లలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ముస్తాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాయి, చక్రి, వెంకటేశ్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో జరిగే పోటీలకు జిల్లా నుంచి వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతోపాటు ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

46 డిగ్రీలు.. నిర్మానుష్యంగా రోడ్లు


నిర్మానుష్యంగా వేములవాడ ప్రధాన రహదారి

వేములవాడ: భానుడి ప్రతాపానికి మంగళవారం వేములవాడలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో జనం బయటకు వచ్చేందుకు భయపడ్డారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినవారు ముఖానికి మాస్కులు, కర్చీఫ్‌లు, నెత్తిన టోపీలు, టవళ్లు కప్పుకొని వెళ్లారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు జ్యూస్ సెంటర్లు, కూలర్లను ఆశ్రయించారు.

గోశాలలకు రాజన్న కోడెలు


కోడెలను అప్పగిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను మంగళవారం వరంగల్, జనగామ జిల్లాల్లోని గోశాలలకు అప్పగించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని భారత్ గోశాలకు 30, జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం విశ్వనాథ్‌పురం శివలింగాల గోశాలకు 30 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, హరినాథ్,శ్యామ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం


కొట్టుకుపోయిన టేలా


గాలికి పడిపోయిన లాండ్రీ షాపు రేకులు

కొదురుపాకలో గాలివాన బీభత్సం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులకు కాలనీలోని రైతువేదిక భవనం పరిసరాల్లో ఉన్న నాంపల్లి లాండ్రీ షాపు రేకులు లేచిపోయాయి. నర్సయ్యకు చెందిన కత్తెరదారు టేలా గాలికి కొట్టుకుపోయి, రోడ్డు అవతల దూరంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనదారులు వస్తే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. అలాగే గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో పోసిన వరి ధాన్యం తడిసింది.

దాతలూ.. నాకు ప్రాణభిక్ష పెట్టండి

- పదేళ్ల క్రితం అమ్మానాన్న మృతి
- జాండిస్‌తో ఆస్పత్రిలో చేరిన సింగారం యువకుడు
- వైద్యానికి రూ.5 లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


చికిత్స పొందుతున్న దేవేందర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అమ్మానాన్న పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు.. సాగు భూమి, సొంతిల్లు.. చేతిలో చిల్లిగవ్వ లేవు. వారి కుమారుడు పసిరికల వ్యాధి(జాండిస్)తో బాధపడుతూ.. ఆస్పత్రిలో చేరాడు. వైద్యానికి డబ్బుల్లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గనగోని దేవేందర్ కొంతకాలంగా జాండిస్‌తో బాధ పడుతున్నాడు. ఇతనికి కొన్ని రోజుల క్రితమే వివాహం జరిగింది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో దినసరి కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దేవేందర్‌ను అనారోగ్యం వెంటాడటంతో తన వద్ద ఉన్న డబ్బులతోపాటు అప్పులు చేసి, ఇప్పటివరకు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు ఖరీదైన వైద్యం అందిస్తే బతికే అవకాశాలున్నాయని, ఇందుకు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమకు ఎలాంటి ఆధారం లేదని, దాతలు స్పందించి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు. సాయం అందించేవారు 87883 93788 (రాజు) ఫోన్ నంబర్‌కు గూగుల్ పే చేయాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్దన్‌గౌడ్ తన వంతుగా రూ.15 వేల ఆర్థికసాయం మంగళవారం అందించారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన


మారుపాకలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వేములవాడఅర్బన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం వేములవాడ మండలం మారుపాక శివారులోని 4 ఎకరాల స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుపాకలో సర్వే నంబర్ 391/1/2లో గుర్తించిన స్థలంలో జీ ప్లస్ టూ విధానంలో 576 ఇళ్లు నిర్మించేందుకు లే-అవుట్ ప్లాటింగ్ సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వేములవాడ డిపో పక్కన నిర్మాణంలో ఉన్న 144 ఇళ్లతోపాటు వేములవాడ అర్బన్ మండలంలోని ఇల్లు లేని నిరుపేదలకు నిర్మించి, ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పవన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, వేములవాడ తహసీల్దార్ రాజు, హౌసింగ్ ఏఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ బన్సీలాల్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని చెక్కపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉప్పర్ మల్యాలకు చెందిన సముద్రాల విజయ్, నిమ్మల సతీశ్‌లు వేములవాడ శివారు ప్రాంతంలో గంజాయి సేవిస్తూ ఇతరులకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు మంగళవారం సమాచారం వచ్చింది. దీంతో అక్కడికి వెళ్లి, తనిఖీలు చేపట్టి, నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కిలో గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ రిమాండ్‌కు పంపినట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయిని నిజామాబాద్ నుంచి తీసుకువచ్చినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, సేవించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై నాగరాజు, కానిస్టేబుల్ రాజశేఖర్ తదితరులున్నారు.

తల్లిదండ్రులపై కుమారుడి దాడి

- భూమి పాస్‌బుక్కులు అడగడమే కారణం

బోయినపల్లి(చొప్పదండి): భూమి పాస్‌బుక్కులు అడిగినందుకు తల్లిదండ్రులపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బోయినపల్లి ఎస్‌హెచ్‌వో సత్తయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డవేని లచ్చవ్వ-ఐలయ్య దంపతుల భూమి పాస్‌బుక్కులు వారి కుమారుడు ఆనంద్ వద్ద ఉన్నాయి. వాటిని తమకు ఇవ్వాలంటూ సోమవారం ఆనంద్ ఇంటికి వెళ్లారు. అతను వారికి పాస్‌బుక్కుల జిరాక్స్‌లు ఇచ్చాడు. తనను పాసుబుక్కులు అడుగుతారా అని మనసులో పెట్టుకొని, అదేరోజు రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చి, వారితోపాటు అడ్డు వచ్చిన మేనత్త గౌరవ్వ, తమ్ముడు నరేందర్, మరదలు స్వాతిలపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఐదుగురికీ గాయాలయ్యాయి. భూమి పాస్‌బుక్కులు అడిగినందుకే తమపై దాడి చేశాడని లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనంద్, గణేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గంజాయికి దూరంగా ఉండండి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- కోనరావుపేట, రుద్రంగి పోలీస్‌స్టేషన్ల సందర్శన


పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల యువత గంజాయికి దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. పాత కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఠాణా ఆవరణలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి మీకోసం అనే కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. యువకులు గంజాయి సేవించడం, రవాణా వంటి కార్యకలాపాలు మానుకోవాలని చెప్పారు. ఇటీవల రెండు కేసుల్లో 3 నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. యువత ఒకసారి కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. పాస్‌పోర్ట్ రాక విదేశాలకు వెళ్లే అవకాశాన్ని కోల్పోతారని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ చంద్రశేఖర్, సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమాకాంత్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సంఘ విద్రోహ శక్తులపై నిఘా ఉంచండి

రుద్రంగి(వేములవాడ): రౌడీలు, సస్పెక్ట్స్, సంఘ విద్రోహ శక్తులపై నిరంతర నిఘా ఉంచి, ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన రుద్రంగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్సై ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వహించే వారికి అవార్డులు, రివార్డులు ఇస్తామని తెలిపారు. బ్లూకోల్ట్స్, పెట్రో కార్ 24 గంటలు గస్తీ తిరుగుతూ పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో పాత నేరస్తులను తనిఖీ చేయాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారి వారంలో రెండు రోజులు తమకు కేటాయించిన గ్రామాన్ని సందర్శించి, పోలీస్ సేవలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, డయల్ 100 వంటి వాటిపై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీరింగ్ ఉద్యోగుల హర్షం


సీఎం కేసీఆర్, మంత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఇంజినీర్లు, ఉద్యోగులు

సిరిసిల్ల: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, హరీశ్‌రావు, కేటీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జి.వెంకట్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ కనకరత్నం, సిరిసిల్ల పీఆర్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లన్నసాగర్‌కు మోహినికుంట రైతులు


ప్రాజెక్టు వద్దకు బస్సులో వెళ్తున్న రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మోహినికుంట రైతులు మల్లన్నసాగర్ ప్రాజెక్టు సందర్శనకు మంగళవారం తరలివెళ్లారు. సర్పంచు కల్వకుంట్ల వనజ ఆధ్వర్యంలో ఇందుకోసం ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. రెండు బస్సుల్లో 80 మంది ప్రాజెక్టును చూసేందుకు వెళ్లారు. ప్రాజెక్టు నిర్మాణం, గోదావరి జలాల తరలింపు, పంట పొలాలకు నీటిని మళ్లించే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించామని సర్పంచు తెలిపారు. మోహినికుంట, ముస్తాబాద్‌లకు గోదావరి జలాలు వస్తున్న విధానాన్ని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్, దేవయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రవి

సిరిసిల్లటౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పంతం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, కారోబార్లు, ఎలక్ట్రీషియన్లను సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. వారికి ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ సోమ నాగరాజు, కో-కన్వీనర్ మల్యాల జాన్సన్, లక్ష్మణ్, వడ్డేపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వేసవి తాపం.. చెరువులో ఉపశమనం

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. మూగజీవాలు సైతం వేసవితాపంతో అల్లాడిపోతున్నాయి. నీరున్న చోటుకు వెళ్లి వేసవితాపం తగ్గేలా సేద తీరుతున్నాయి. ఎండవేడికి ఓ చెరువులో నుంచి అటు ఇటు రావడం గంభీరావుపేట మండలకేంద్రంలో మంగళవారం కనిపించింది.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): నలుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని బోయినపల్లి మండలంలోని కొత్తపేటకు చెందిన వేల్పుల మల్లయ్య తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం.. కొత్తపేటకే చెందిన లక్ష్మణ్, రాములు మేక పిల్లల మేత కోసం మంగళవారం మల్లయ్య చేలో చెట్ల కొమ్మలు విరిచారు. ఎందుకు విరిచారని ఆయన అడగడంతో రాయితో కొట్టారు. ఈ ఘటనలో మల్లయ్య ఎడమ కన్ను వద్ద గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్, రాములుతోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్తయ్య తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు

సిరిసిల్ల: జిల్లా జెడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మంగళవారం తెలిపారు. జెడ్పీ ఆఫీస్‌లో స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ సమావేశాలకు హాజరవుతాయరని ఆమె వివరించారు.

వడదెబ్బతో జీపీ కార్మికుడి మృతి

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు నక్క రాజన్న(50) వడదెబ్బతో మంగళవారం మృతిచెందాడు. మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తున్న రాజన్న సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదే రాత్రి ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. సర్పంచ్ ఎడమల జయ, ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

- యువకుడి దుర్మరణం

మెట్‌పల్లి(కోరుట్ల): వెల్లుల్ల శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన విఘ్నేశ్, రాహుల్‌లు ద్విచక్రవాహనంపై వెల్లుల్ల వైపు వెళ్తున్నారు. అదే సమయంలో వెల్లుల్లకు చెందిన వన్నెల మహేశ్ బైక్‌పై మెట్‌పల్లికి వస్తున్నాడు. మార్గమధ్యంలో వీఆర్ఎం గార్డెన్ వద్ద వాహనాలు వేగంగా వచ్చి, ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో విఘ్నేశ్, మహేశ్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మహేశ్ మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

విగ్రహ ధ్వంసం కేసులో ఇద్దరి రిమాండ్

గొల్లపల్లి(ధర్మపురి): మల్లన్నపేటలో హనుమాన్ ఆలయంలోకి చొరబడి, స్వామి వారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల గంగాధర్ తన భార్య కాపురానికి రావడం లేదని, నక్క శ్రీధర్ తనకు వివాహం కావడం లేదని రెండు రోజుల క్రితం స్థానిక హనుమాన్ దేవాలయంలో స్వామివారి విగ్రహాన్ని ధ్వంసం చేసి, పారిపోయారు. స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్టు చేశారు. జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఇద్దరికీ జ్యుడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

- ఇటీవలే పదోతరగతి పాసైన సిరివెన్నెల
- కోనరావుపేటలో విషాదం


సిరివెన్నెల (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఇటీవలే పదోతరగతి పాసైన ఓ విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సుతారి శ్రీనివాస్-భాగ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సిరివెన్నెల(15) ఇటీవలే పదోతరగతి పాసైంది. దీంతో వారు ఎంతగానో సంతోషించారు. కానీ దురదృష్టవశాత్తు సిరివెన్నెల పసిరికల వ్యాధి(జాండిస్)కి గురైంది. తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చూపిస్తూ మందులు వాడుతున్నారు. అయినా వ్యాధి ముదరడంతో పరిస్థితి విషమించి, మంగళవారం చనిపోయింది. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు సుల్తాన్ రాజు, రహీం, తోటి విద్యార్థులు ఆమె ఇంటికి వెళ్లి, సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాలిపోయిన చెరుకు పంట



కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ముత్యాల కిషన్‌రెడ్డికి చెందిన చెరుకు పంట కాలిపోయింది. మంగళవారం మధ్యాహ్నం ఊరికి వెళ్లి వచ్చి, చూసేసరికి పంటకు మంటలు వ్యాపించాయి. ఆర్పే ప్రయత్నం చేసినా ఎకరంన్నర చేను కాలిపోయిందని బాధితుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించాడు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రాజన్న అప్‌డేట్స్..

కొనసాగుతున్న భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను మంగళవారం 10వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబసమేతంగా రాజన్నకు మొక్కులు చెల్లించారు.

నేడు హుండీ లెక్కింపు

రాజన్న హుండీని బుధవారం ఉదయం 8గంటల నుంచి లెక్కించనున్నారు. ఈవో కృష్ణప్రసాద్ ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.2వేల నోట్లపై ఆలయ అధికారులు నజర్ పెట్టారు. భక్తుల నుంచి తప్ప, స్థానికుల నుంచి రూ.2వేల నోట్లు తీసుకోవద్దని అధికారులు సూత్రప్రాయంగా వెల్లడించినట్లు తెలిసింది. దీంతో పలు కౌంటర్లలో పని చేసే సిబ్బంది అప్రమత్తం అయ్యారు.

బదిలీలకు రంగం సిద్ధం

రాజన్న ఆలయంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి అంతర్గత బదిలీలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. మంగళవారం ఆలయ అధికారులు, సిబ్బంది బదిలీలపై చర్చించుకున్నారు. తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు పైరవీలు ముమ్మరం చేశారు.

పీఆర్వో కార్యాలయం మార్పు

వివిధ ప్రాంతాల నుంచి రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే వీఐపీలకు సేవలందించేందుకు ఏర్పాటైన పీఆర్వో కార్యాలయం మారింది. రాజేశ్వరపురం వసతి గదులు కూల్చివేస్తుండటంతో 5, 6వ గదులు సైతం కూల్చేశారు. దీంతో 2వ నంబర్ గదిలోకి పీఆర్వో కార్యాలయాన్ని మార్చారు.

షెడ్డులోనే సేద

రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వసతి సౌకర్యం లభించకపోవడంతో వాహనపూజల కోసం వేసిన షెడ్డులోనే సేదతీరారు. రాజన్నకు మొక్కులు చెల్లించి షెడ్డులో వంటావార్పు చేసుకున్నారు. మండుతున్న ఎండలకు ఎక్కడా సరైన చోటు లేక భక్తులు షెడ్డులో తలదాచుకున్నట్లు చెబుతున్నారు.

రాజేశ్వరపురం గదుల కూల్చివేత షురూ


కూల్చివేసిన వసతి గదులు

రాజన్న గుడి కట్టపై నిర్మించిన వసతి గదులను ఆలయ అధికారులు కూల్చివేస్తున్నారు. భవనం కాలంచెల్లినట్లు భావించిన ఆలయ ఇంజినీరింగ్ విభాగం ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, కూల్చివేతలు మొదలుపెట్టారు. మంగళవారం కట్టపైనున్న వసతి గదుల గోడలు తొలగించారు. గదులను కూల్చివేయడంతో తాత్కాలిక షెడ్లు వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది.